నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, గురువారం 12 సెప్టెంబర్ 2024 | KHAMMAM

నిలకడగా గోదావరి

47.10 అడుగుల వద్ద ప్రవాహం

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 11 : ఎగువ ప్రాంతాల నుంచి వరద లేకపోవడంతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పడుతున్నది. మంగళవారం రాత్రి 11 గంటలకు 49.50 అడుగుల వద్ద గోదావరి ప్రవాహం ఉండగా.. బుధవారం ఉదయం 7 గంటలకు 50.30 అడుగులకు చేరింది. ఉదయం 9 గంటలకు 50.60 అడుగులకు చేరుకుని.. 11 గంటల నుంచి గంట గంటకూ తగ్గుతూ ఉంది. రాత్రి 10 గంటలకు 47.10 అడుగుల వద్ద నిలకడగా ఉంది. దీంతో రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించుకున్నారు. ఎగువన వర్షాలు తగ్గుముఖం పట్టడంతో చర్ల మండలంలోని తాలిపేరు వద్ద గోదావరి ప్రవాహం నిలకడగా ఉంది. పేరూరు వద్ద కూడా గోదావరి ప్రవాహం తగ్గింది. ప్రస్తుతానికి భద్రాచలం వద్ద 48.40 అడుగుల మేర ప్రవాహం ఉండడంతో రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నది. రాత్రికి మరింతగా వరద తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

భద్రాచలం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

అందరికీ అన్నం పెట్టే అన్నదాతలు ప్రకృతి ప్రకోపానికి పుట్టెడు దుఃఖంలో మునిగిపోయారు.. గత యాసంగిలో భూగర్భ జలాలు అడుగంటడం, సాగర్ నీళ్లు రాకపోవడంతో కనీసం తిండిగింజలు కూడా పండలేదు.. భారీ నష్టాలను మూటగట్టుకున్నారు. దీంతో ఈ వానకాలమైనా పంటలు బాగా పండించి ఆర్థికంగా నిలబడదామనే గంపెడాశతో సాగు చేపట్టిన రైతన్నలపై వరుణుడు పగపట్టాడు. అతి భారీ వర్షాలు కురవడంతో మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు అయ్యింది. వరదలకు పంట దెబ్బ తినడమే కాకుండా పంటపొలాల్లో ఇసుక మేటలు వేయడం, బండరాళ్లు చేరడం మరింత విషాదకరం. అతివృష్టి దెబ్బకు కోలుకోలేని స్థితిలోకి విసిరేయబడ్డారు. మొత్తానికి వరుస నష్టాలతో ఖమ్మం జిల్లా రైతన్నలు కుదేలయ్యారు. పెట్టుబడికి చేసిన అప్పుల బాధతో కుమిలిపోతున్నారు. తమకు వ్యవసాయం మాత్రమే తెలిసిన అన్నదాతలు అప్పులు తీరే దారి లేక మదనపడుతున్నారు. కొంతలో కొంతైనా ప్రభుత్వం ఆదుకోకపోతుందా.. అని సాయం కోసం కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.

- ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 11

గూడూరుపాడు-తనగంపాడు గ్రామాల మధ్య దెబ్బతిన్న వరి పొలాలు

ఏం మిగల్లేదు..

• పంటలన్నీ గంగపాలు

- ప్రకృతి ప్రకోపం.. పుట్టెడు దుఃఖంలో అన్నదాతలు
- వరుస నష్టాలను చవిచూస్తున్న ఖమ్మం జిల్లా రైతులు
- యాసంగిలో అనావృష్టి.. వానకాలంలో అతివృష్టి
- మొన్నటి వరదల దెబ్బకు కోలుకోలేని స్థితి
- తాజా గణాంకాల ప్రకారం 68 వేల ఎకరాల్లో పంటనష్టం
- కొనసాగుతున్న వ్యవసాయ అధికారుల సర్వే
- ప్రభుత్వ సాయంపై కొండంత ఆశ

ఒక్కరోజు వ్యవధిలోనే యావత్ ఖమ్మం జిల్లా రైతాంగాన్ని వరదలు అతలాకుతలం చేశాయి. పంటలు గంగపాలు కావడంతో రైతులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. పోయిన యాసంగిలో సాగర్ కాలువకు నీటి విడుదల లేకపోవడం, తీవ్ర నీటి ఎద్దడి కారణంగా భూగర్భ జలాలు అడుగంటడంతో వేలాదిమంది సాగుకు దూరంగా ఉండిపోయారు. కనీసం తిండి మందమైన పంటను పండించుకోలేని పరిస్థితి యాసంగిలో కనిపించింది. అయితే ఆ లోటును వానకాలం సీజన్‌లో పూడ్చుకుందామని ఎన్నో ఆశలతో సాగుకు రైతులు శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం ఏటా అందిస్తున్న పంటల పెట్టుబడి సాయం(రైతుబంధు) అందకపోయినప్పటికీ అప్పులు చేసి మరీ సాగు చేపట్టారు. వానకాలం సీజన్‌లో వరదలు వచ్చేనాటికి జిల్లావ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగులోకి వచ్చాయి. నెలరోజుల నుంచి మిర్చితోటల సాగు చేపడుతున్నారు. వానకాలం సీజన్‌కు సంబంధించి పెసర పంట మాత్రమే అక్కడక్కడ చేతికి వచ్చింది. పత్తి పంట మరో నెలరోజుల్లో ఏరే సమయం ఆసన్నమైంది. వరికి సంబంధించి పంట పొలాలు పొట్ట దశకు చేరుకున్నాయి. పెట్టుబడికి వెనకా ముందూ ఆలోచన చేయకుండా సాగు చేపట్టిన రైతులపై ప్రకృతి మరోసారి కన్నెర్ర చేసింది. ఒకే ఒక్కరోజులోనే అధిక వర్షపాతం నమోదు కావడం. ఎగువన కురిసిన వర్షాలకు భారీగా వరదలు రావడంతో వేలాది ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. కండ్ల ముందే పంట గంగపాలు అవుతున్న తీరును చూసిన మున్నేటి పరిసర ప్రాంతాల రైతుల బాధలు అన్నీఇన్నీ కావు. జిల్లాలో అత్యధికంగా పాలేరు నియోజకవర్గంలోనే భారీగా పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు పేర్కొంటున్నారు. నాలుగురోజుల నుంచి గ్రామాల్లో వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు దెబ్బతిన్న పంటల సర్వే చేపడుతున్నారు. తాజా గణాంకాల ప్రకారం 33 శాతం కంటే ఎక్కువగా 68 వేల ఎకరాల్లో నష్టం జరిగినట్లు అంచనా వేశారు. సర్వే పూర్తయితే పంటనష్టం విలువ మరింత పెరిగే అవకాశం ఉంది.

46 వేల మంది రైతులు.. 68 వేల ఎకరాలు

జిల్లా వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం(10వ తేదీ సర్వే పూర్తి వరకు) జిల్లావ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి 46,374 మంది రైతులకు చెందిన 68,345 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇందుకు సుమారు రూ.68,34,50,000 నష్టం వాటిల్లి ఉండవచ్చని అంచనా వేశారు. క్షేత్రస్థాయిలో మరో రెండురోజుల పాటు పంట నష్టం సర్వే కొనసాగే అవకాశం ఉంది. పంటల వారీగా విశ్లేషిస్తే పత్తి 16,727 మంది రైతులకు సంబంధించి 27,639 ఎకరాలు దెబ్బతినగా నష్టం రూ.27.63 కోట్లు, మక్కసాగు 25 మంది రైతుల 47 ఎకరాలకు నష్టం రూ.4.70 కోట్లు, పెసర సాగు 292 మంది రైతుల 660 ఎకరాలకు నష్టం రూ.66 లక్షలు, వరి సాగు 26,607 మంది రైతుల 35,590 ఎకరాలకు నష్టం రూ.35.59 కోట్లు జరిగింది. మిర్చి తోటలు 2,532 మంది రైతుల 4,178 ఎకరాలకు నష్టం రూ.4.17 కోట్లు, కూరగాయల సాగు 155 మంది రైతుల 131 ఎకరాలకు నష్టం రూ.13.10 లక్షలు, అరటి సాగు 13 మంది రైతుల 68 ఎకరాలకు నష్టం రూ.3.20 లక్షలు, బొప్పాయి 23 మంది రైతులకు సంబంధించిన 68 ఎకరాలు దెబ్బతినగా.. రూ.6.80 లక్షల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. రెండు, మూడు రోజుల్లో సర్వే ప్రక్రియ పూర్తి అయితే నష్టం విలువ మరింత పెరిగే అవకాశం ఉంది.

పొలాలను చూస్తే దుఃఖం వస్తున్నది..

ఊరిముందుకు వచ్చి పొలాలను చూస్తే దుఃఖం వస్తున్నది. నలభై ఏండ్లలో ఏనాడు ఇంత పెద్దగా వరద రాలేదు. వచ్చినా నష్టం ఇంతగా జరగలేదు. వరద ఆగింది కాబట్టి మేం మిగిలాం. లేకపోతే ఆ వరదలోనే మా ఊరు కొట్టుకుపోయేది. నాకు ఏటి ఒడ్డున ఉన్న ఎకరంన్నర పొలంలో ఏమీ మిగలలేదు. దాదాపు నలభై వేల రూపాయలు పెట్టుబడి పెట్టాను. వరద పోయిన తర్వాత నా పొలంతో పాటు చుట్టపక్కల చూస్తే ఏ ఒక్కరి పొలం మిగలకుండా పోయింది. సర్కార్ మా ఇబ్బందిని చూసి సాయం చేయాలి.

– బట్టు పెద్ద వెంకయ్య, రైతు, తనగంపాడు, ఖమ్మం రూరల్

పదివేలు ఏ మూలకు సరిపోతాయ్..

పంటలు దెబ్బతిన్న పొలాలకు ఎకరానికి రూ.10 వేలు ఇస్తామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నారు. ఆ పైసలు ఏ మూలకూ సరిపోవు. నాకు ఎకరం భూమి మాత్రమే ఉంది. దాదాపు అన్ని ఖర్చులు కలిపి రూ.30 వేల వరకు పెట్టుబడి పెట్టాను. పంట చేతికి రాకపోగా ఇప్పుడు ఆ పొలంలో ఇసుక మేట వేసింది. ఇసుక మేట తీసివేయాలంటేనే రూ.లక్ష పైగా ఖర్చు అవుతుంది. పంట పొలంతోపాటు అక్కడే డెయిరీ ఫాం కోసం షెడ్ వేసుకున్నాం. దళితబంధు పథకం ద్వారా మంజూరైన పెద్ద షెడ్ కూడా వరదలో కొట్టుకుపోయింది. పదివేలు కాకుండా నష్టాన్ని చూసి ప్రభుత్వం ఆదుకోవాలి.

– గుగ్గిళ్ల పెద్ద రాములు, రైతు, తనగంపాడు, ఖమ్మం రూరల్

రెండు లక్షల నష్టం జరిగింది..

వరదలు రావడం వల్ల మాకు దాదాపు రూ.2 లక్షల నష్టం జరిగింది. నాకు ఏడు ఎకరాల భూమి ఉంది, మూడు ఎకరాలు తనగంపాడు ఏరియాలో మిగిలింది గూడూరుపాడు పరిధిలో ఉంది. ఏటి ఒడ్డున ఉండడం ద్వారా వరద మొత్తం పంట భూమిలో నుంచి పోయింది. వరి పొలంతోపాటు పత్తి, మిర్చి తోట పనికిరాకుండా పోయింది. లక్షల రూపాయలు మిత్తికి తీసుకొచ్చి పెట్టుబడి పెట్టాం.. పంట మొత్తం గంగపాలయ్యింది. ప్రభుత్వం పెద్ద మనస్సుతో ఆలోచన చేసి సాయం చేయాలి.

– మారుతి వెంకటప్పయ్య, గూడూరుపాడు, ఖమ్మం రూరల్

నర్సింగ్ విద్యార్థినులకు సౌకర్యాలు కల్పిస్తాం..

ఐటీడీఏ పీవో రాహుల్

పీఎంహెచ్ హాస్టల్‌లో సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 11 : గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉంటూ నర్సింగ్ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులకు సకల సౌకర్యాలు కల్పిస్తామని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. భద్రాచలంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఎంహెచ్ హాస్టల్‌ను బుధవారం సందర్శించిన ఆయన పరిసరాలు, డార్మెటరీ, డైనింగ్ హాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత వార్డెన్‌పై ఉందని, నిత్యం సెల్‌ఫోన్లు వాడకుండా, ఇతర వ్యసనాలకు బానిసలు కాకుండా చూసుకోవాలన్నారు. పీఎంహెచ్ హాస్టల్‌కు శాశ్వత భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం ఐటీడీఏ ప్రాంగణంలోని నర్సింగ్ కళాశాలను సందర్శించి.. పరిసరాలు, డార్మెటరీ, వంటశాల, టాయిలెట్లు, బాత్‌రూంలను తనిఖీ చేశారు. వంటషెడ్డు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, డీఈ హరీశ్, టీఏ శ్రీనివాస్, వైద్యులు చైతన్య, వార్డెన్లు సుశీల, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

'పది'లో ఉత్తీర్ణతా శాతం పెంచాలి

భద్రాద్రి డీఈవో వెంకటేశ్వరాచారి

తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరాచారి

దమ్మపేట, సెప్టెంబర్ 11 : పదో తరగతిలో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు ఇప్పటి నుంచి ప్రణాళికతో బోధించాలని డీఈవో వెంకటేశ్వరాచారి అన్నారు. గండుగులపల్లి, నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిజిటల్ తరగతుల బోధన, ఎఫ్ఆర్ఎస్ నమోదు, మధ్యాహ్న భోజన పథకం అమలు, స్కూల్ గార్డెన్, 10వ తరగతి ప్రత్యేక తరగతుల నిర్వహణ, యూడైస్ డేటా నమోదు తదితర అంశాలపై హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. నాగుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌కె.సైదులు, ఎంఈవో లక్ష్మి, మండల నోడల్ అధికారి జగపతి, హెచ్ఎంలు సీతారామయ్య, మెచ్చు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేయి చేయి కలిపి.. గుంతలు పూడ్చి..

శ్రమదానం చేసిన ఆటో డ్రైవర్లు

మధిరలోని ముస్లిం కాలనీ, హనుమాన్ కాలనీలకు వెళ్లే గుంతలను పూడ్చుతున్న ఆటోడ్రైవర్లు

మధిర, సెప్టెంబర్ 11 : భగీరథ పైపులైన్ కోసం అధికారులు ఎనిమిది నెలల క్రితం మధిర పట్టణంలోని ముస్లిం కాలనీ, హనుమాన్ కాలనీకి వెళ్లే ప్రధాన రహదారిని తవ్వించారు. తమకేమీ పట్టనట్లు నెలలకొద్దీ నిర్లక్ష్యంగా వదిలేశారు. తవ్విన చిన్న చిన్న గుంతలు వాహనాల రాకపోకలతో పెద్దగా మారి తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాహనదారులు నిత్యం కిందపడిపోయి గాయాలపాలవుతున్నా మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆయా కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా.. ప్రమాదాలను రోజూ గమనిస్తున్న ఆయా కాలనీల ఆటో డ్రైవర్లు చేయి చేయి కలిపారు. ఆటోలను పక్కనపెట్టి శ్రమదానం చేశారు. కంకర, మట్టి రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు. ఎవరో వస్తారని.. రోడ్డు బాగు చేస్తారని ఎదురు చూడకుండా.. ఆటో డ్రైవర్లే శ్రమదానం చేసి రోడ్డుపై గుంతలను పూడ్చడంతో గ్రామస్తులు మెచ్చుకుంటున్నారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు మంద ఆనందరావు, ఎస్‌కే సైదా, లాల్ సైదా, మస్తాన్, స్వామి, పవన్, చందా తిరుపతిరావు, వసీం, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

పెసర్ల కొనుగోళ్లు షురూ..

- ఖమ్మం కేంద్రంలో ఒకేరోజు 130 క్వింటాళ్లు కొనుగోలు చేసిన మార్క్‌ఫెడ్
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

ఖమ్మం వ్యవసాయం, సెప్టెంబర్ 11 : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ అధికారులు ఎట్టకేలకు పెసర్ల కొనుగోళ్లు షురూ చేశారు. బుధవారం క్వింటాకు రూ.8,682 ధరతో ఒకేరోజు 130 కింటాళ్లు(267 బస్తాలు)లను అధికారులు కొనుగోలు చేయడంతో పంట ఉత్పత్తులను తీసుకొచ్చిన రైతులు సంతోషం వ్యక్తం చేశారు. పెసర్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి పది రోజులు కావస్తున్నా 'పిసరంత కొనలే..!' అనే శీర్షికన 'నమస్తే తెలంగాణ'లో బుధవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఒకవైపు ఉష్ణోగ్రతలు పెరగడం.. మరోవైపు ఉన్నతాధికారుల నుంచి అధికారులపై ఒత్తిడి పెరగడంతో ఎట్టకేలకు అధికారులు కొనుగోళ్లు చేపట్టారు. వైరా కేంద్రానికి నాణ్యమైన సరుకు రాకపోవడంతో కొనలేకపోయామని, ఎక్కువ మొత్తంలో పంట ఉత్పత్తులు వస్తే కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పారు. కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన పంట, తేమ 12 శాతం లోపు ఉంటే ప్రతి రైతు సరుకును కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ మేనేజర్ సునీత తెలిపారు.

రాత్రికి రాత్రే సర్వం కోల్పోయాం..

- ఇళ్లు కొట్టుకుపోయాయి.. పొలాలు మునిగిపోయాయి..
- అన్నింటా అపార నష్టం జరిగింది.. ఆదుకోండి సారూ..
- కేంద్ర బృందానికి వరద బాధితులు, అన్నదాతల మొర..
- కూసుమంచి, ఖమ్మం రూరల్లో 'కేంద్ర' అధికారుల పర్యటన
- దెబ్బతిన్న ఇళ్లు, పంటల పరిశీలన, ఫొటో ఎగ్జిబిషన్ వీక్షణ
- నేరుగా బాధితులు, రైతులతో మాట్లాడిన 'కేంద్ర' సభ్యులు

తిరుమలాయపాలెం మండలం రాకాశితండాలో కేంద్ర అధికారుల ఎదుట చేతులు జోడించి గోడు వెళ్లబోసుకుంటున్న వరద బాధితురాలు జర్పుల సక్రి

కూసుమంచి/ ఖమ్మం రూరల్/ తిరుమలాయపాలెం, సెప్టెంబర్ 11: 'వందేళ్లలో ఎన్నడూ ఇలాంటి విపత్తు రాలేదు. రాత్రికి రాత్రే ఇళ్లు, పొలాలు మునిగిపోయాయి. రోడ్లు కొట్టుకుపోయాయి. కాలువలకు గండ్లు పడ్డాయి. పచ్చటి పంటలన్నీ మా కళ్లెదుటే ఎడారిలా మారాయి. అన్నింటా అపార నష్టం జరిగింది. ఆదుకోండి సారూ..' అంటూ కేంద్ర బృందం ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాలకు చెందిన వరద బాధిత రైతులు. ఇటీవలి భారీ వర్షాలు, వరదల కారణంగా ఖమ్మం జిల్లా కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లో ఇళ్లు, పంటలు, రహదారులు, వంతెనలు దెబ్బతిన్న విషయం విదితమే. దీంతో వరద ప్రభావిత ప్రాంతాలకు వెళ్లి తీవ్రతను అంచనా వేసేందుకు కేంద్ర బృందం అధికారులు బుధవారం ఈ మండలాల్లో పర్యటించారు. దీంతో వరద బాధితులు, రైతులు తమ ఆవేదనను కేంద్ర బృందానికి వినిపించారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కూడా నష్ట తీవ్రత గురించి కేంద్ర అధికారులకు వివరించారు.

కూసుమంచిలో..

కూసుమంచి మండలంలో పర్యటించిన కేంద్ర అధికారులు.. పంటల నష్టానికి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. వరద తీవ్రత వల్ల తెగిన రహదారులు, సాగర్ కాలువకు పడిన గండ్లు, మునిగిన భక్తరామదాసు ప్రాజెక్టు మోటర్లు, ఇసుక మేటలు వేసిన పొలాలను పరిశీలించారు. తరువాత ఇదే మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను కూడా పరిశీలించారు. కోక్యాతండాకు చెందిన వడ్డియా నర్సింహారావు తోపాటు మల్లాయిగూడెం రైతులతో కేంద్ర అధికారులు మాట్లాడారు. జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. కేంద్ర బృందంలో సెంట్రల్ టీం అధికారులు కే.ప్రతాప్ సింగ్, మహేశ్‌కుమార్, శాంతి స్వరూప్, కుషవహా, నియల్‌ఖాన్ సన్, శశివర్ధన్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు. జిల్లా అధికారులు అభిమన్యుడు, విద్యాసాగర్, పుల్లయ్య, మంగలంపుడి వెంకటేశ్వర్లు, కోక్యానాయక్, వేణుగోపాల్‌రెడ్డి, సరిత, వాణి, రమేశ్ రెడ్డి, మన్మథరావు, రత్నకుమారి, రామచందర్‌రావు, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రూరల్లో..

కేంద్ర బృంద అధికారులు ఖమ్మం రూరల్ మండలంలోనూ పర్యటించారు. దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. తనగంపాడులో ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించి పంటల నష్ట తీవ్రతను గమనించారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌తో కలిసి ఇసుక మేట వేసిన పొలాలను పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడారు. అయితే, తమ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ప్రకటించిన రూ.10 వేల పరిహారం ఏమాత్రమూ సరిపోదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కస్నాతండాలోనూ ధ్వంసమైన ఇళ్లను, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ మధుసుదన్‌నాయక్, ఇతర అధికారులు గణేశ్, పుల్లయ్య, మధుసూదన్, సరిత, అపర్ణ, ఉమా నగేశ్ పాల్గొన్నారు.

తిరుమలాయపాలెంలో..

తిరుమలాయపాలెం మండలంలో పర్యటించిన కేంద్ర అధికారుల ఎదుట వరద బాధితులు బోరున విలపించారు. అన్ని విధాలా నష్టపోయిన తమను ఆదుకోవాలంటూ వేడుకున్నారు. బంధంపల్లి, రాకాశితండా, రావిచెట్టుతండా గ్రామాల్లో పర్యటించిన కేంద్ర అధికారులు.. ఆకేరు ప్రవాహానికి, భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను, దెబ్బతిన్న ఇళ్లను, జరిగిన నష్టాన్ని పరిశీలించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్, ఏవో సీతారామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకుంటాం..

పరిహారంపై ప్రతిపాదనలు రూపొందించండి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

విస్తా కాంప్లెక్స్ వద్ద మోటార్లను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న మంత్రి తుమ్మల

బూర్గంపహాడ్ (భద్రాచలం), సెప్టెంబర్ 11 : ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని, పరిహారం అందించడానికి ప్రతిపాదనలు రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమీక్షా సమావేశంలో వరద నష్టం వివరాలను శాఖలవారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిల భవనాలను ఎక్కడికక్కడ తొలగించాలని, పంటలు మునిగితే శాస్త్రవేత్తల సలహాలు తీసుకుని భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. భద్రాచలం డివిజన్‌లో దెబ్బతిన్న రోడ్లను మరమ్మతు చేయాలని, వరదలతో 14 గ్రామాల్లో పాడైపోయిన రోడ్లకు ప్రతిపాదనలు పంపించాలని, అన్ని మండలాల్లో కల్వర్టులు, బ్రిడ్జిల ఫొటోలు చేయించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, వైద్యులు ముంపు ప్రాంతాల్లోనే కాక అన్ని పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, ఆర్డీవో దామోదర్‌రావు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో నష్టం జరగలేదు..

ముందు జాగ్రత్తలతోనే గోదావరి వరదలతో ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో రూ.40 కోట్లతో కొత్త కరకట్ట నిర్మాణంతో భద్రాచలం పట్టణం, చుట్టుపక్కల గ్రామాల్లో వరద ముంపు జరగకుండా చేశామన్నారు. మణుగూరు, ఖమ్మం మండలాల్లో ఎక్కువ శాతం ఆస్తి నష్టం జరిగిందని, ఇండ్లు మునిగిపోయాయని, నీట మునిగిన పొలాలకు ఎకరాకు రూ.10 వేలు తక్షణ సాయం అందించామని, 2 వేల ఇండ్లు ముంపునకు గురికావడంతో ప్రతి ఇంటికి రూ.16,500 చొప్పున సహాయం అందించనున్నట్లు చెప్పారు.

మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయండి..

దేవస్థాన భూములను సర్వే చేసి మాస్టర్ ప్లాన్ రూపొందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. భక్తులకు దుర్గంధం వెదజల్లకుండా పరిసరాలతోపాటు పట్టణ వీధుల్లో చెత్తాచెదారం వేయకుండా పంచాయతీ సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు చేపట్టాలన్నారు. తొలుత గోదావరి వరద ఉధృతితోపాటు కరకట్ట నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. విస్తా కాంప్లెక్స్ వద్ద మోటర్లను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట ఎమ్మెల్యే తెల్లంతోపాటు కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవో, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన సీపీ సునీల్ దత్

ఖమ్మం ప్రకాశ్ నగర్ బ్రిడ్జి వద్ద నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ సునీల్ దత్, కమిషనర్

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 11 : ఖమ్మం నగరంలో గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. నగరంలోని ప్రకాశ్‌నగర్ మున్నేరు వద్ద గల నిమజ్జన ప్రాంతాన్ని నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి సీపీ బుధవారం పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. శోభాయాత్ర, నిమజ్జన సమయంలో రహదారిపై వైర్లు, చెట్ల కొమ్మలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, పోలీసులతోపాటు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ నిమజ్జన వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా క్రేన్లు, ఫ్లడ్ లైట్లు, రూట్‌మ్యాప్, బారికేడ్లు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్ రావు, సీఐ రమేశ్, కార్పొరేటర్లు లక్ష్మి, వెంకన్న పాల్గొన్నారు.

387 మంది జేపీఎస్‌ల బదిలీ

మామిళ్లగూడెం, సెప్టెంబర్11 : జిల్లాలో పరిపాలనాపరమైన కారణాలతో జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న 387 మందిని బదిలీ చేస్తున్నట్లు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ ఉత్తర్వుల్లో ప్రస్తుతం పని చేస్తున్న మండలం, నియోజకవర్గం కాకుండా ఇతర మండలాలు, నియోజకవర్గాల్లో పోస్టింగ్‌లు కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో స్థానచలనం పొందిన కార్యదర్శులు పోగా.. మిగిలిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు బదిలీలు నిర్వహించారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న పంచాయతీ కార్యదర్శులు వెంటనే ఎంపీడీవోకు రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.